కథానిక

# "ద్రౌపది నవ్వింది"

"గోపీ"

"ఎవరండీ ఇందాక మీతో మాట్లాడుతూన్నదీ?"

"చూశావూ వాణ్ణి!"

"మీతో మాట్లాడుతూంటే ఏదో అలావచ్చి, ఎవరు చెప్మా అని చూస్తే—"

"తప్పులేదు లే! వాడిదో చరిత్ర! అనుకోకుండానే ఏదో చేస్తాం...ఒకప్పుడవి విషమిస్తాయి...అదే జరిగింది వాడి జీవితంలో కూడా!"

"చాలా వ్యంగ్యంగా చెబుతున్నారే విషయాన్ని!"

"లేదు. విడమర్చి చెబుతావిను. మయసభలో దారీ తెన్నూ కానక అవస్థ పడుతూన్న దుర్యోధనుణ్ణి చూచి ద్రౌపది నవ్వింది. పరాభవింప బడ్డ దుర్యోధనుడు, ఆమెను అవమానించడానికి నిండు సభలో వివస్త్రను చెయ్యాలని చూచాడు. తరవాత ప్రతిజ్ఞలు పెనువేసుకు పోయాయి...వాటి పర్యవసానం మహాభారతయుద్ధం...అదేమాదిరిఒక 'నవ్వు ఘట్టం' మా శీను జీవితాన్నిపూర్తిగా మార్చేసింది."

"ఇది'పిల్లి' అంటే అర్థం 'మార్జాలంలా'ఉంది."

"పోనీ ఇదంతా ఎందుకు, చెబుతావిను వాడికథ.'

"అనగా అనగా!"

"ఆదేం లేదిప్పుడు, వాడి వయస్సు ఇప్పుడు నలభై. నాతోటి వాడే."

"అంత ముగ్గుబుట్టలా పండిందే జుట్టు? చూస్తేనే అదో మాదిరనిపించింది వాలకం."

"అదే కథంతా! ముప్ఫైఏళ్ళ వరకూ మంచి పిల్లవాళ్ళలో అగ్రగణ్యుడుగా గడిపేశాడు. ఎటొచ్చీ ఈ పదేళ్ళ కథే నీకు చెప్పదలుచుకున్నది. వాడూ నేనూ చాలా చిన్నప్పుడు కలిసి చదువుకున్నాం. సభాపిరికి. వాడిపేరు చెప్పలేదు కదూ! శ్రీనివాసరావు. అంతా శీనూ అనే పిలిచే వాళ్ళం. అందరికంటే అరగంట ముందొచ్చీ వాడు స్కూలుకి, ఆఖరుకి వెళ్ళేవాడు. క్లాసుతో ఏ శిక్ష ఇచ్చినా చాలా నెమ్మదిగా, భరించేవాడు అపర గాంధీ మహాత్ములా. అట్టేమంది స్నేహితులు కూడా ఉండేవారు కారు ఏదో ఒకటో అరో తప్పిస్తే."

"ఓస్! ఆ అరా, మీరేనా?"

"అసలు కథ వినూ! ఆటల్లోనీ, పోటీ పందేల్లోనీ, ఎక్కడా పాల్గొనే వాడే కాదసలు. పరీక్షలు మాత్రం వరస తప్పకుండా ప్యాసౌతూ వచ్చాడు. అదీ ఏమంత ఘనంగా కాదు మరీని. హైస్కూల్లో ఉంటూండగానే మరో ఊరు మారాం, తరువాత అప్పుడప్పుడు వాడిసంగతి వింటూ వచ్చాను."

'నేను కాలేజీలో చేరాక రామ్మూర్తి కనబడ్డాడు. ఏరా రామూ మన శీనెల్లా ఉన్నాడ్రా? అని అడిగాను ఆలోచన వెళ్ళినంత మట్టుకు ప్రశ్నలడిగేసి తరువాత "అలాగే ఉన్నాడ్రా, పరీక్షలు ప్యాసై పోతున్నాడు. ప్రపంచ జ్ఞానం మాత్రం ఏకోశానా కనబడదు. ఎక్కడేనా విసురుగా తిరిగే కాలేజీ అమ్మాయిల గాలి తగుల్తే కాస్త బాగు పడాలి" అన్నాడు. ఇద్దరం నవ్వుకున్నాం కాసేపు. తరువాత నాలుగేళ్లు దొర్లిపోయాయి. సదాశివు కనబడ్డాడు (అప్పుడే కాబోలు బహుశా అమ్మగారిని చూడ్డానికి బయలుదేరాను) కుశల ప్రశ్నలు అదీ ఇవీ ఐపోయినాక "శీను సంగతేమన్నా విన్నావురా?" అని అడిగాను."ఓ! తెలీకపోవడం ఏమిటి? ఆ గండామృగం అలాగే ఉన్నాడు. ఇప్పుడు బి. ఏ. ప్యాసైయ్యాడు. రంగుమాత్రం మారలేదబ్బీ!" అని చెప్పాడు...మరి కొన్ని సంవత్సరాలు దొర్లిపోయాయి. పెండ్లయినట్లు, పిల్లలు కలిగినట్లు కూడా విన్నాను.

సరిగ్గా ఐదేళ్ళ క్రిందట ఒకనాటి సాయంత్రం బీచీలో పోతున్నా. 'దూను'ఉద్యోగంలో చేరినాకే. అన్నయ్య కూతురు పెండ్లి తరువాత అక్కడ బీచిదగ్గర ప్రత్యక్షం శీను. అసలు పోల్చుకోలేక పోయాను. రంగు, వేషం,అంతా ఫిరాయించేశాడు.

"శీనూ!" అంటూ ఒక గావుకేక పారేశాను. "ఆఁఆ" అంటూ పరిగెత్తుకుంటూ వచ్చి చెయ్యి

ఊడిపోయేట్టు గుంజి ప్రశ్నల వర్షం కురిపించాడు. ఒక చల్ మోహనరంగడిలాగ నొక్కు నొక్కుల జుట్టూ, సెంటు వాసన. అమెరికన్ టై. ఇటూ అటూ ఎవరికోసమో చూస్తున్నట్లు వాడిచూపులూ వాలకం చాలా క్రొత్తనిపించింది.

"ఏరా శీనూ ఏమిటి సమాచారం?" అడిగాను.

"అబ్బే! ఇప్పుడు తీరుబాటు లేదు. ఇక్కడికిరా?" అని ఒక చిన్న కాగితంమీద ఎడ్రసు గీకేడు. గండామృగంలాంటి శీను, ఇలా తయారు అయ్యాడంటే కనుక్కోకుండా ఎలాగుండడం? వాడి హోటలుకి వెళ్ళి కలుసుకున్నాను.

సిగరెట్ పొగ విలాసంగా వదుల్తూ, గిరగిరా తిరుగుతూన్న ఫంకా ప్రక్క ముఖం ఎత్తి చూస్తూ రమ్మని ఆహ్వానించాడు.

"మొదలెట్టు నీ కథ" అడిగాను.

"కాఫీ రానీ" అని ఆర్డరిచ్చాడు కాఫీకి.

కాఫీ త్రాగుతూ ఆరంభించాడు "నువ్వు డూన్‌లోనే ఉంటున్నావా?" మొదటి ప్రశ్న విసిరాడు. 'ఆఁ' అన్నాను.

"ఎప్పు డెళ్ళిపోతావ్" రెండో ప్రశ్న.

"ఏం? అంత ఆత్రుతగా అడిగావ్?"

"మరేంలేదు. ఎంతవరకూ నిజం నీతో చెప్పడం అని. నువ్వు హిమాలయాల్లో మానస సరోవరం ప్రాంతంలో ఉంటావు మళ్లా మరో శతాబ్దం వరకూ రావు అని తెలిస్తే నూటికి నూరుపాళ్ళూ నిజం చెప్పేస్తాను." అన్నాడు విలాసంగా నవ్వుతూ.

"అంటే ఇప్పుడు నిజం చెప్పవన్నమాట!"

"అబ్బే! అదేంకాదు. కొన్ని ముఖ్యవిషయాలు మాత్రం చెప్పను అంతే!" అని మరి ఆలస్యం చెయ్యకుండా ఆరంభించాడు.

* * *

"నీకు తెలుసుకదూ! స్కూలు, కాలేజీ, తరువాత పెండ్లి ఉద్యోగం అంతాను. అప్పటివరకూ అదోవిధంగా పోయేది. రేపునా ముప్ఫయోపుట్టిన దినమనగా ఇవాళ సాయంత్రం మా శ్రీమతి ప్రక్కమీద వెలకిల్లాపడుకొని అదే నవ్వటం! ఎందుకో చెప్పదు-నాకు మొదటిసారిగా కోపంవచ్చింది.

"ఎందుకా నవ్వు?" గద్దించాను.

"ఏమండీ! ఒక ప్రశ్న అడుగుతాను, కోప్పడక చెబుతారూ?" అని నవ్వుమధ్య తేల్చింది ప్రశ్న.

"ఆ!" అన్నాను.

"మీరు చదువుకూంటున్నప్పుడుగానీ ఉద్యోగం చేస్తూన్నప్పుడుగానీ పెండ్లిచేసుకున్నాకగానీ ఒకళ్ళని ప్రేమించాం ద్వేషించాం, ఇది వాళ్ళు మెచ్చుకున్నారు, ఇది వాళ్లు కంట్రగించారు, వీళ్ళు మిత్రులు, వీళ్ళు కారు అనుకున్నారూ? దేనికన్నా ప్రమాదవశాన్నన్నా ఒక ప్రైజు వచ్చిందీ?" అని.

"ఎందుకూ?" అని అడిగాను తెల్లబోయి.

"ఎందుకేమిటి! వచ్చిందా, రాలేదా?" అడిగింది మా శ్రీమతి. నువ్వు వినేఉంటావు మా శ్రీమతి పెండ్లినాటికి చాలా అందగత్తె అనీ, ప్రమాదవశాన్న నాలాంటి అడవిమనిషికి 'భార్యగా' లభ్యమైందని ప్రజ అనుకోవడం. అదే అభిప్రాయాన్ని మా ఆవిడకూడా కలిగిఉండడంలో అసహజమేమీ లేదనుకో!

అడిగిన ప్రశ్నకి తీవ్రంగానే "లేదు" అని చెప్పేశాను.

"అది రేపు రానున్నది" అని ప్రకటనమాదిరి చెప్పింది.

"ఎవరా ఇచ్చేది?" అడిగాను ఘాటుగా.

"నిన్న వాళ్ళంతా వచ్చారా? మాటల సందర్భంలో రేపు మా ఆయన ముప్ఫయ్యో పుట్టిన రోజు అంటే అంతా అదోమాదిరిగా నవ్వి, తప్పకుండా ఒక బహుమతి ఇవ్వాలన్నారు. వాదప్రతివాదాలు బాగా జరిగాయి." అని, అమ్మలక్కల వాదప్రతివాదాల సారాంశాన్ని విన్నవించింది శ్రీమతి. (అదిప్పుడు చెప్పడానికి నాకు ఓపికకానీ తీరుబాటుకానీ లేదనుకో)."

"నీ మాటకడ్డువచ్చాననుకోక, రామ్మూర్తి కూడా అదే అన్నాడు, 'వీడు పిల్లల్నెలా కంటున్నాడ్రా' అని." నేనన్నది విన్నట్లుగా విలాసంగా నవ్వి మీసంమెలేసి, మరో సిగరెట్ ముట్టించి కథ సాగించాడు.

"మా శ్రీమతి నవ్వు, ఆడంగుల అపహాస్యం, చాలా కలవరపెట్టాయి. అంతవరకూ గడచిన జీవితంలో ఏవో ఉండవలసిన మైలురాళ్ళు లేనట్లనిపించింది. లోపల లోపల ఏదో కల్లోలం జరుగుతూన్నట్లు, నేనేదో మారిపోతున్నట్లు ఫీలైయ్యాను.

మర్నాడు మా శ్రీమతి స్నేహితురాండ్రు, వారి భర్తలూ ఆహ్వానింపబడ్డారు. అంతా మనం 'మను' అంటూ కూర్చోడమే ఎప్పటిలాగే. భోజనందగ్గర మామ్మూలుగానే ఎవ్వరూ పట్టించుకోలేదు. వయస్సులో ఉన్న మా శ్రీమతి స్నేహితులు స్వేచ్ఛగా నన్ను రాసుకుపోయి, మాతులు పక్కకి తిప్పుకొని నవ్వుకునేవారు. మా శ్రీమతి ఎప్పటిలాగే అతిథులను సత్కరించడంలో నిమగ్నురాలై ఉంది... క్రిందటిరాత్రి నాలో కలిగిన చలనం పర్యవసానం కాబోలు, తెలియక చేసిన వాళ్ళ చిలిపిచేష్టలు, చూపులు చాలామత్తు కలిగించాయి. మా శ్రీమతి లెక్చెరులో నాప్రవర్తనవల్ల ప్రజ ఆమెకి పుట్టిన బిడ్డల్ని కూడా శంకిస్తూన్నట్లు చెప్పినమాట జ్ఞాపకం వచ్చింది... ఇహ జనసమూహాన్ని వదిలి, పెరట్లో నుయ్యిదగ్గర పచారు చేస్తూ నిలబడ్డాను.

కొంచెం సేపట్లోనే మా ఆవిడ నూతిదగ్గరకి వస్తూన్నట్లయింది. "అతిథులు ఏమనుకుంటారండీ మీరు కనపడకపోతే?" అన్న ప్రశ్న మొదటిసిగా తెలుసు. చాటుగా నిలబడ్డా. ఆ వచ్చినది మా ఆవిడ కాదు. మా ఆవిడ స్నేహితురాలు, పేరు రాధ అని తరువాత తెలిసింది. గుండె దబదబా కొట్టుకుంది. కాని ఏదో తెలియని నరాల ఉద్రేకంతో ఆమె చెయ్యి పుచ్చుకుని నావైపు లాక్కున్నాను. అకస్మాత్తుగా జరిగిన ఈ సంఘటనకి భీత్తరపోయి అరవడానికి సిద్ధంగాఉంది. "నువ్వరిచినా ఏమీ లాభంలేదు. ఎవ్వరూ నమ్మరు. నువ్వే నాకోసం వచ్చావు అంటారు మీదు మిక్కిలి" అంటూ ఆమెని మరీదగ్గరగా లాక్కున్నాను. నే చెప్పిన విషయం అర్థం చేసుకుంది. ఆమెకికూడా నాప్రవర్తన అర్థంకాలేదు... వశీకరణ మంత్రం పడ్డదానిలా లొంగిపోయింది. ఆమె నన్ను చూచే వచ్చింది. చీకటిలో ఒక యువతిని ఒంటరిగా చూస్తే తప్పకుండా లేడి పిల్లలా ఒక గంతువేసి పారిపోతానని ఆమె అభిప్రాయం: ఈ చిలిపితనం ఫలితం తరువాతకాని ఆమెకి అవగాహన కాలేదు.

సరి అవాళతో కథ అడ్డంగా తిరిగింది. ఆహ్వాన పత్రాలని రద్దుచెయ్యటం మానేశాం. ప్రతీ ఆహ్వానాన్ని, ఇదే విధంగా ఏదో కొత్త పిట్టని పట్టడానికి వాడుక చేసేవాణ్ణి... దూసుకుపోయేట్టు చూచే మా శ్రీమతి స్నేహితులు నా కోర చూపులకి తట్టుకోలేకపోయారు. శ్రీమతి నాలో మార్పు గుర్తించి కంగారుపడ్డది కాని అప్పటికప్పుడే చాలా దూరం పోయింది వ్యవహారం. ఇప్పుడో అమ్మాయి నా తలకి మత్తెక్కించింది. ఆమెకోసమే ఈ వేటం తాను" అని ముఖంమీద జిడ్డు సెంటు వాసనలు చేతి రుమ్మాలుతో తుడుచుకున్నాడు.

"ఆమె సంసార స్త్రీయేనా?" అడిగాను.

"అదంతా తర్జనభర్జన చేసే అవస్థలో నేను లేనబ్బాయ్!" అన్నాడు శీను.

"ఇదేం బాగులేదోయ్ శీనూ!" అన్నాను.

"పెళ్ళాం పిల్లలూ ఇల్లు వ్యవహారం ఉన్న వాడివి... ఇదేనా నువ్వనేది? అవన్నీ చాలా మంది చెప్పారు. మా ఆవిడ గోల నువ్వు మొదట్లో వింటే గుండె కరిగిపోయి ఉండేది కానీ ఇదేదో భూతం పట్టినట్లుంది, మళ్ళా రాస్తా మారేట్టు కనబడదోయ్." అన్నాడు ఒక దీర్ఘ నిశ్వాసం విడుస్తూ.

"ఎందుకింత?"

"క్షేమబుద్ధి? అంతేనా? ఏదో మంచో, ఎలాగోయ్ మళ్ళా పాత జీవితానికి పోయేది? ఈ మార్పు వచ్చాక, ఎన్ని సంఘటనలు జరిగాయనుకున్నావ్? మొదట్లో తెలిసిన ప్రతీవాళ్ళూ దేనికో దానికి పిలుస్తూ వచ్చారు. తరువాత ఆహ్వానాలు కష్టపడి తెప్పించుకొనేవాణ్ణి. ఇప్పుడాస్థితి కూడా మారిపోతుంది. ఎవరూ నన్ను తెలిసినంత వరకూ పిలవరు. ఒక విషయం చెబితే నువ్వు నమ్మవు. ఇప్పటికీ చాలామంది ఆడవాళ్ళు నాకు ఆహ్వానాలు వచ్చేట్టు చూస్తారు... భర్తలకెంత భయమో. భార్యలకంత—" ఆపేశాడు అర్థవాక్యంలో.

"భేష్" అన్నాను.

"నువ్వ వేగిరం జండా ఎత్తేయ్యక పోతే నాకు నిద్దర పట్టదు. ఇవాళ మూడొంతులు ఆ పిట్టని పట్టే నన్నమాటే."

"ఆ!" అని నోరు తెరుచుకొని విన్నాను. ఇదంతా పీడ కట్టుకథ అనీ, ఇదోరకం పిచ్చి అనీ నా నమ్మకం వింటూన్నంత సేపూ. లేకపోతే శీనేవిటి ఈ వ్యవహారం ఏవిటి.

"నేనింక వెళ్ళిపోవాలి. నువ్వనవసరంగా నా విషయంలో జోక్యం కలుగ జేసుకోకు పర్యవసానాలు జోరుగా ఉంటాయ." అనేసి లోపలికి

వెళ్ళాడు. వాడి వాలకంలో మామూలు పిచ్చి ఏమీ కనపడలేదు. శలవు పుచ్చుకొని వచ్చేశాను.

నేనూ పేకాటలు విడిచి బయటకువచ్చి, ఇటూ అటూ తిరిగి బీచికి చేరుకున్నాను. 'నేనేంచెయ్యాలి? వీడినెలా శిక్షించాలి!" అని అని ఆలోచిస్తూ కూర్చున్నాను. ఎవడో ఆగంతకుడు వచ్చి "ఒక అమ్మగారు పిలుస్తూన్నారండీ' అని చెప్పాడు. సందు తిరిగి ఆగంతకుడు చూపిన ఇంట్లోకి వెళ్ళాను. ఒక ముప్పది ఏండ్ల ప్రౌఢ, దీర్ఘ విచారంతో ఉన్నట్లు కూర్చుంది. ఒకప్పుడు చాలా అందంగా ఉన్నట్లు కూడా ఎవరేనా గుర్తించవచ్చు. కూర్చోమంది. ఆమె ప్రవర చెప్పింది. శ్రీనివాస రావు భార్య. ఇద్దరు పిల్లలు. ఆయన్ని వెంబడిస్తూ వచ్చింది. ఎలాగైనా శీనును దార్లో పెట్టమని కథంతా చెప్పింది. శీను చెప్పింది చాలామట్టుకు నిజమే! ఉద్యోగం మానేశాడు. పిత్రార్జితం తగల పెట్టేశాడు. ఎవరు ఏమన్నా లక్ష్యం లేదు. 'చంపుతా నరుకుతా' అని కూడా బెదిరిస్తాడు. శీను చేసిన ఎగతాళి తప్ప తక్కినవన్నీ శీను చెప్పినట్లే చెప్పింది.

"నాకేమీ పాలుపోకుండా ఉందండీ!" అన్నాను.

"పోనీ ఆయన్నో రెండేళ్లు జైలుకేనా పంపిస్తే దార్లోపడతారేమో!"

"ఎలాగ?" అడిగాను.

"అదే నాకూ తెలీకుండా ఉంది" అన్నది.

"ఎవర్నో చెరిపారనో, ఏదో దొంగతనం చేశాడనో" అని చెప్పాను.

"అబ్బే ఎలాగండీ అది! అంతా ఘరానా కుటుంబాల్ని నాశనంచేశారు. ఎవ్వరూ రారు బయటికి" అన్నది నిస్పృహంగా.

"అయితే నేనేంచేయగల్ను మరి?" అడిగాను సందేహంగా.

"అదేనండీ! మీ కిక్కడ దగ్గిర బంధువుల్లో పోలీసు ఇనస్పెక్టరుట, ఆయనతో చెప్పి కాస్త దయ్యంవదిలేవరకూ కాప్పెట్టమంటే?" అని అసలు విషయానికి వచ్చింది.

దేవాంతకం పిడుగులా ఉందనిపించింది ఆవిడ విషయం. ఎలా కనుక్కుందో విషయమంతా నాకే ఆశ్చర్యంవేసింది.

"అబ్బే! నే నిక్కడ ఒకటిరెండు రోజులు మాత్రం ఉంటానండీ, నావల్ల పడదండీ. క్షమించండీ!" అంటూ మెల్లిగా తప్పుకున్నాను.

ఆమెనిచూస్తే దయ, అసహ్యం రెండూ ఒక్కసారే వేశాయి. కాని ఎలాగో తప్పుకున్నాను ఈ గొడవనుంచి.

"అయితే చివరకేమైంది?" అడిగింది శ్రీమతి.

"ఏమవడం ఏమిటి. ఆమె కోరికప్రకారం, ఒకసారి ఒక మైనరు అమ్మాయిని చెడిపాడని కేసు. దాంతో రెండేళ్లు శ్రీ కృష్ణ జన్మస్థానం. తరువాత మళ్ళా ప్రజలమధ్య పడ్డాడు. ఈ మారు భయం భక్తీ లేకుండా, మరీ పెచ్చు మీరిపోయాడు. శ్రీని భార్య పిచ్చెత్తిపోయింది. పిల్లలు ఎక్కడో చేరుకున్నారు. ఇప్పుడు ఎవ్వరూ ఏమీ చెయ్యలేరు వాణ్ణి. సానివీధులంట స్వేచ్ఛగా తిరుగుతున్నాడు.

"తిండి" అడిగింది మళ్ళా.

"అదీ అక్కడే. నాటకంలో అంతర్నాటకం. వీడిని చూస్తే ఒక సానికి మోజు. వీడంటే పడిచస్తుందట. ఇంటికి వస్తే చాలని చూస్తుందట. జేబు ఖర్చు కూడా ఇచ్చి పోషిస్తూందట!" చెప్పాను.

"ఇదంతా ఎవరు చెప్పారు మీకు" అడిగింది శ్రీమతి.

"వాడే! ఇప్పుడు చెబుతూన్న సోదంతా అదే! పూర్వంకంటే తెగబడి విషయాలు చెప్పాడు. 'ఎప్పుడు డూన్ వెళ్ళిపోతావ్' అని అడిగి నువ్వన్నా, ఎవరితోటి చెప్పినా నాకేం ఫరవా లేదులే ఇప్పుడు అన్నాడు తాపీగా."

"ఛీ!"

"ఛీ! ఏం? అంత మంచివాణ్ణి వెక్కిరిస్తే అంతే జౌతుంది. చూడమ్మాయ్! నన్ను కూడా అలాగే ఎగతాళి చేశేవ్! ఎవరెప్పుడు మారిపోతారో?" అన్నాను హాస్యంగా.

"మీ పుణ్యా ముంటుంది బాబూ! నేరకపోయి కదిపాను. ఇంక వెళ్ళి వంట చేసుకుంటా" అంటూ హడావుడిగా కంగారుగా వెళ్ళిపోయింది శ్రీమతి. నాకు నవ్వాగలేదు. ★

(ఆధారం: మొపాసా)